


# స్వార్థంలోనూ అర్థం వుంది

కె. రామలక్ష్మి

పురుషోత్తమరావు గారు వాలు కుర్చీలో పడుకుని పేపరు తిరగేస్తున్నారు. టకటక బూట్లు చప్పుడు చేసుకుంటూ అప్పుడే స్కూలు నుంచి వచ్చిన ఆయన మనవడు రవి "తాతయ్యా!" అంటూ అమాంతం మీద పడ్డాడు.

"అబ్బా! " అంటూ వాడిని గభాలున తోసి నిలబెట్టారు. "నాకు పేపరియ్యి, తాతయ్యా! సినిమా పేజీ చూసి ఇచ్చేస్తా!" నంటూ పేపరు లాక్కున్నాడు. రావుగారు పేపరు వాడి కిచ్చేశారు. కళ్ల జోడు తీసి కళ్లు తుడుచుకున్నారు. ముందుకు వంగి పాదం బొటన వేలు చూసుకున్నారు. దాని పాట్ల కాస్త చిట్లి రక్తం చిమ్మింది. నిజానికి మనవడిని ఆయన ఏమీ అనలేదు. వాడి మోచేయి ఆయన పొత్తి కడుపులో బలంగా గుచ్చినట్టయి చాలా నొప్పి పుట్టింది. వాడి బూటు కాలు పడి బొటన వేలు చిట్లింది. ఆయనకే దరిదాపు కన్నీరు వచ్చింది నొప్పికి. కానీ ఆయ నేం మాట్లాడలేదు. "తప్పురా, ఏమి టా పడటం?" అని మనవడిని కేకలేసి ఉండొచ్చు. కానీ ఆయనలా చేయ లేదు. మౌనంగా ఊరుకున్నారు.

వా డా పేపరు పట్టుకు పోయి హాల్లో సోఫా మీద పడ్డాడు. కత్తెర కోసం వెతుకుతున్నాడు. వాడి అభిమాన నటుడు చిరంజీవో, మోహన్ బాబో తెలియదు. వాడి బొమ్మ కత్తిరించి వాళ్ల అమ్మ చూసేలోగా పుస్తకంలో దాచేయా లన్నదే వాడు తాపత్రయం. తాతయ్య 'అబ్బా!'

అన్నప్పుడైనా, 'ఏమైంది?' అని అడిగే టైము లేదు వాడికి. వా డేం పసి పాప కాదు, పదేళ్ళు వచ్చాయి.

"ఏరా కొంపకి రాడం, మీ తాత పేపచరివ్వడం అయిపోయిందా? వెధవా! ఇంటికి రాడం, ఆ యూనిఫారం విప్పడం ఏం లేదా?" అంటూ బజారు నుంచి వస్తూనే కొడుకుని చూసి కళ్యాణి విరుచుకు పడింది. వాడు తెలివైన వాడు. 'తాత నంటూంటే నే నెందుకు చెప్పుకోవడం లాక్కున్నా నని!' అనుకుని, "ఇదిగో ..." అంటూ లేచ్చక్కా పోయాడు.

"ఛ! ఛ! ఎన్నిసార్లు చెప్పినా ఒకటే. హాల్లో ఇలా చేస్తే ఎవ్వరైనా వస్తే ఎంత అసహ్యంగా ఉంటుంది!' ' విసుక్కుంటూ వాడు కత్తిరించి పోసిన కాగితం ముక్కలు ఏరి లోపలికి చక్కా పోయింది కళ్యాణి. వాలు కుర్చీలో కళ్లు మూసుకుని పడుకున్నా పురుషోత్తమరావు గారికి చెముడు లేదు. అన్నీ వినబడుతూనే ఉన్నాయి. కానీ ఏం చెప్తారు? 'వాడే లాక్కున్నాడమ్మా' అంటే, 'ఎందుకు లాక్కోనిచ్చారు?' అంటుంది. అందుకే ఊరుకున్నారు. ఇంకో గంటో, గంటన్నరో - కొడుకు రామ్మూర్తి వస్తాడు. కుర్చీలో తండ్రిని చూస్తూనే "హాయిగా పడుకున్నారా! మీకేం, నేనే ఈ డొక్కు స్కూటరుతో నానా తంటాలూ పడి కొంప చేరుతున్నాను" అనుకుంటూ ముద్దుగా తండ్రిని పలకరిస్తాడు. అదే ఎదురు చూస్తున్నారు పురుషోత్తమరావు గారు.

రావుగారి కింకా అరవై ఐదు దాటి అరవై ఆరో ఏడు వచ్చింది. అంతే. రిటైరై వచ్చిన డబ్బు బ్యాంకులో వేశారు. ఉద్యోగంలో ఉండగానే ఈ చిన్న ఇల్లు కట్ట గలిగారు. ఒక్క కూతురికీ పెళ్లి చేసి పంప గలిగారు. భార్యని పైకి సవ్యంగా సగౌరవంగా పంపేయ గలిగారు. ఎటొచ్చీ ఈ ఒక్క కొడుకు తనని సరిగా కడతేరుస్తాడా అన్న ఆందోళన ఆయనలో ఒక సంవత్సరం నుంచి చోటు చేసుకోవడం మొదలు పెట్టింది. కాస్త భయం కూడా పట్టుకుంది. ముందు కాలం ప్రశాంతంగా గడుస్తుందా అని.

కాఫీ గ్లాసు ఓ చేత్తోనూ, ఇంకో పేపరు మరో చేత్తోనూ పట్టుకుని తండ్రికి దగ్గరగా మరో కుర్చీ లాక్కుని కూర్చున్నా డా పూట రామ్మూర్తి.. "నాన్నా, కాఫీ!" అంటూ అందించాడు. బొటన వేలు చిట్లి పాదం మోపు చేసింది. కదిలితే నొప్పి పుడుతోంది. అప్పటికీ బాండేజ్ వేసు కున్నారు. కాఫీ అందుకుంటూ కొడుకు ముఖంలోకి చూశారు పురుషోత్తమరావుగారు. ఆయనకి తెలుసు - వా డేదో అడగా లన్నప్పుడే ఇలా కాఫీ పట్టుకు వస్తాడు. దగ్గరగా కూర్చుంటాడు.

"నాన్నా! నా ఫ్రెండ్ ఓ మంచి సలహా ఇచ్చాడు' ' అన్నాడు ఎంతో ఉత్సాహంగా. తండ్రి ఆనంద పడిపోతూ ఏమిటీ? అని ఎగిరి గంతేయాలని రామ్మూర్తి కోరిక. కానీ ఆ దశ దాటి పోయింది. ఇప్పుడు ఇంట్లో వాళ్లని, వారి మాటలని, వారి చేష్టలని, అర్థాలని, అంతరార్థాలని ఇట్టే చదవ గలుగుతున్నా రాయన. రిటైరై పోయాక చాలా త్వరగా ఈ నేర్పు వచ్చేసిం దాయనకి.

"మేడంతా అలా డాబాగా వదిలేయడం ఈ కాలంలో దండగ. ఓ మూడు గదుల పోర్షన్ వేయించు. మంచి అద్దె వస్తుంది, ఇట్టే అప్పు తీరిపోతుంది అన్నాడు. ఇది చాలా బాగుంది అనుకున్నాను. మీ రేమంటారు? మీరు ఊఁ అనండి, నేను ప్లాన్ వేయించుకుని వస్తాను' అన్నాడు ఉత్సాహంగా ముందుకి వంగుతూ.

కాఫీ తాగి గ్లాసు పక్కన పెడుతూ "నా కిష్టం లేదురా! ఇప్పుడిం కీ ఇల్లు పెంచడం దేనికి?" అన్నారు.

"అదేమిటీ అలా అంటారు? డబ్బు చేదా? బ్యాంకులో దాని కెలాగూ గొప్ప వడ్డీ రాదు. పైన కాపురం ఉంటే మనిషి సాయం ఉంటుంది. నెల నెలా రాబడీ ఉంటుంది. మీరు ఈ రోజులకి తగ్గట్టు ఆలోచించడం లేదు, నాన్నా!" కాస్త విసుగ్గా అన్నాడు రామ్మూర్తి.

'నా కెందుకురా అంత డబ్బు? వడ్డీ వస్తుంది. పెన్షన్ వస్తుంది. అది చాలదా? ఈ వయస్సులో పరుగెత్తి పాలు తాగాలని అనుకోవడం లేదు నేను. శరీరం, మనస్సు కూడా విశ్రాంతిగా ఉంచుకుందుకు ప్రయత్నిస్తున్నా. ఆరోగ్యం చెడకుండా ఉండాలని కోరుకుంటున్నా" చాలా సౌమ్యంగా కొడుక్కి వివరించారు.

విసురుగా లేచాడు రామ్మూర్తి - "కళ్యాణి అన్నది నిజ మైంది. మీరు ఛస్తే ఒప్పుకో రంది!" అన్నాడు.



పురుషోత్తమరావు గారేం బదులు చెప్పలేదు. ఏం చెప్తారు? 'తాతయ్య దగ్గర డబ్బుంది మీద కట్టమను!" అంటూ మనవడిని ప్రేరేపించడం విన్నారు. వచ్చిన వారితో, " మా చేతుల్లో ఏముందీ, ఆయన గారి జీతం రాళ్లు తప్ప! ముసలాయన ముంగిలా దేనికీ బయట పడరు!" దెప్పడం విన్నారు.

"మీరు ఆలోచించండి, నాన్నా! కాలం మారింది. కాస్త పెట్టుబడి పెడితే చాలు, ఏళ్లూ పూళ్లూ వేచి చూడక్కర లేకుండానే పెట్టిన డబ్బు పెరిగి పోయే రోజులు. మీ రిలా మూర్ఖంగా ఉంటా రనుకో లేదు" అన్నాడు.

"నువ్వు లోన్‌కి పెట్టి పైన కట్టుకోరా! నే నేం కాదన్నానా?"

"ఏం మీ డబ్బు నా డబ్బు కాదా? తరవాతైనా నాకే కదా ఇస్తారు? ఇప్పుడిస్తే ఉపయోగం."

"నా కలా అనిపించడం లేదు. నన్ను కాస్త విశ్రాంతిగా ఆలోచించుకోనివ్వండి. నా వల్ల మీ కేం డబ్బు దండగలేదు. ఇంకా తిరుగుతున్నాను కనుక చాకిరీ బాధ లేదు. ఎందుకు తొందర పడతారు?" అడిగారు.

"మీరు చాలా స్వార్థంగా ఆలోచిస్తున్నారు, నాన్నా! వెధవ నానిగాడి కో సైకిలు అడిగితే నాన్న నడుగు అంటారు. కొత్త స్కూటరు కొంటా నంటే కొనుక్కో అంటారు కానీ 'ఇంద' అంటూ పైసా రాల్చరు! ఏం అంతా కూతురికైనా కేటాయింపు.'

కాస్త వ్యంగ్యంగా అడుగుతున్న కొడుకు ముఖంలోకి క్షణం సేపు తదేకంగా చూశారు పురుషోత్తమరావు గారు. కృష్ణుడు నోరు తెరిస్తే యశోదకి ముల్లోకాలూ కనిపించా యంటారు. కానీ కొడుకు కళ్లలో ఆయన కేం కనబడడం లేదు. చిన్నప్పుడు అన్నీ రోగాలే వాడికి. భుజం మార్చి భుజం మీద వేసుకు తిప్పుతూ నెలల తరబడి నిద్ర లేకుండా గడపడం జ్ఞాపకం వచ్చింది. చదువుకునే రోజుల్లో చెల్లెలికి చిన్న నగ చేయించినా, ఇల్లు పీకి పంది రేసిన గొడవ జ్ఞాపకం వచ్చింది. 'పెళ్లికి ఖర్చు ఎక్కువగా పెట్టేసి తన కేం మిగల్చకుండా చేస్తా రీ పెద్దలు' అంటూ అందరి దగ్గరా వాపోవడం జ్ఞాపకానికి వచ్చింది. 'పెళ్లయి కోడలు వచ్చాక, నాన్న ఖర్చుకైనా డబ్బు లివ్వడు' అంటూ నసుక్కోవడం జ్ఞాపకం వచ్చింది. చదివించి ఉద్యోగం వవేదెకి వేయించి ఓ ఇంటి వాణ్ని చేశాక ఇప్పుడు తనని శాసిస్తా డేమిటి అని వింతగా అనిపించింది.

రిటైరైన నాటి నుండి పురుషోత్తమరావు గారిలో జాగ్రత్త మరీ ఎక్కువైంది. మనవడి సరదాలు తీర్చడని విసుక్కున్నా, 'మీ నాన్న నడగరా' అనడం అలవాటు చేసుకున్నారు. 'తాత పిసినారి, ఏం కొని పెట్టడు' అని మనవడు కూడా అనుకోవడం కష్ట మనిపించ లేదాయనకి. అదే నయం అనిపించింది. 'ఆది నిష్ఠురం మేలు' అనుకున్నా రాయన. తన తరపు చుట్టాలే తక్కువ. కోడలు తరపు వా రొచ్చినా ఎప్పుడూ ఆయన ఏమీ అనలేదు. కానీ అందరిలోనూ ఓ భావన అంతర్లీనంగా ఉంటూనే ఉంది. 'ఈ ముసలాడు పిసినారి. కొడుక్కీ, మనవడికీ ఖర్చు చేయడు' అన్నది.

"బాగా ఆలోచించండి, నాన్నా! పోనీ ఈ ఇల్లు నా పేర కాకుంటే రవి పేర పెట్టండి. నేను అమ్ముకుంటాననేగా మీ భయం! ఆస్తి పెంపొందాలంటే పెట్టుబడి పెట్టాలి. మీ రింకేం చేయ లేరు. చేస్తా నంటే నన్ను ప్రోత్సహించరు!" అంటూ చక్కా పోయాడు.

మళ్లీ జేరబడి కళ్లు మూసు కున్నారు పురుషోత్తమరావు గారు.

"ఉన్నావా? ఎటైనా వెళ్లావేమో ననుకున్నాను' ' అంటూ పాత స్నేహితుడు నాగభూషణం గారు వచ్చి పక్క కుర్చీలో కూలబడి పై గుడ్డతో ముఖం తుడుచుకున్నారు. 'ఓ కప్పు కాఫీ ఇవ్వగలిగితే బాగుండు'నని పురుషోత్తమరావుగారు అనుకున్నారు. కానీ కోడలిని కేక వేయ లేదు. తన కోసం ఎవ రొచ్చినా దండగ అనే ఆమె గట్టి నమ్మకం.

"ఏం ఇలా వచ్చావు?" ఆప్యాయంగా అడిగారు.

"నా కో పాతిక కావాలి రావూ! మందులు కొనుక్కోవాలి. డాక్టరు చీటీ రాశాడు కానీ, డబ్బు లివ్వడుగా!" బాధగానూ, సిగ్గుగానూ అంటున్న నాగభూషణాన్ని చూసి కళ్లు తడి య్యాయి.

జుబ్బా జేబులో నుంచి ఓ ఏభై కాగితం తీసి, "ఇంద!" అంటూ ఇచ్చారు. "ఆరోగ్యం జాగ్రత్త! అది కాస్తా పోతే ..."

పురుషోత్తమరావు గారి మాటలు పూర్తి కాకుండానే, "అధోగతే!" నవ్వడానికి ప్రయత్నించి విఫలమయ్యారు.

"రావూ! నీ మాట వినక ఈ స్థితికి వచ్చాను. ఇప్పుడు ఇల్లు, పెరడు కలిసి అమ్మకానికి పెట్టారు ఇద్దరు కొడుకులూ. నా దగ్గర చిల్లి గవ్వ లేదు. రోజా వాళ్ల నెక్కడ ప్రాధేయ పడగలను? అంత కంటేకుల వృత్తి స్వీకరిద్దామా అని ఆలోచిస్తున్నాను.'

'అంటే భిక్షాటనకి బయలుదేరుతావా? ముక్కు పిండి నీకు నెల కింతని ఇ మ్మనక!' కోపంగా అన్నారు.

"అప్పు డిక ఎక్కడింత చోటు దొరికితే అక్కడ రాత్రి పడుకోవాలి" పేలవంగా అన్నారు నాగభూషణం.

'అంత దిగాలు పడకు! ఏ లాయరు చేతో చెప్పించు, భూషణం! వాళ్లు బతికింది నీ మీద. ఇప్పుడు నువ్వు అడ్డ అనుకుంటే నీ పెట్టుబడిలో కాస్తయినా తిరిగి ఇవ్వ వలసిందే!'

కచ్చితంగా అంటున్న మామ గారి మాటలు అప్పుడే బయటికి రాబోతున్న కళ్యాణి వింది. ఆమె ఆశ్చర్యపోయింది మామ గారి చిన్న బుద్ధికి.

నాగభూషణానికి ధైర్యం చెప్పి లోపలికి వెళ్లి కండువా భుజాన వేసుకున్నారు పురుషోత్తమరావుగారు. ఆయన కొన్ని మాసాలుగా అనుకుంటున్న దాన్ని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా అమలులో పెట్టాలని నిర్ణయించుకున్నారు. జోళ్లు వేసుకోలేక పోయారు బొటన వేలు వాయడం వల్ల.

ఆయన వెళ్లగానే భర్త రావడం చూసి, "మీ నాన్న దేవాంతకులు!" అంటూ నాగభూషణంతో అన్న మాట గురించి చెప్పింది. "మేక పోతు గాంభీర్యం! ఏం చేస్తాడులే!" అంటూ తోసి పారేశాడు రామ్మూర్తి.



# పాశ్చాత్య సంస్కృతిలోని హీనత్వం ఏమిటి?

మనలో చాలామంది భారతీయ సంస్కృతి వేరు, పాశ్చాత్య దేశాల సంస్కృతి వేరు అని భావిస్తూ, తరచుగా పాశ్చాత్య సంస్కృతిని హీనమైనదిగా పేర్కొనడం జరుగుతూంటుంది. ఇందుకు కారణం 'మానవు లందరూ ఒకటే ననే విశాల దృక్పథం' మనలో లేకపోవడమా, లేక పాశ్చాత్య దేశాలు సాంస్కృతికంగా నిజంగానే మనకంటే వెనకబడి ఉండడమా అనే సందిగ్ధ స్థితి మనలో ఏర్పడడం సహజం.

కానీ పాశ్చాత్య సంస్కృతిలోని హీనత్వం చారిత్రాత్మక సత్యం అనే విషయం చాలామందికి సాధారణంగా అర్థం కాదు. అంటే - ఒకప్పుడు, అనగా ఇప్పటికి ఐదు వేల సంవత్సరాలకు పూర్వం ప్రపంచంలోని మానవజాతి అంతా ఒకే సంస్కృతిని ఉన్నతాదర్శాలతో పాటిస్తూండగా, క్రమంగా ఆ ఆదర్శాలు ప్రపంచవ్యాప్తంగా బలహీనపడి పాశ్చాత్య దేశాలలో దాదాపుగా రూపుమాసిపోవడం; భారతదేశంలో మాత్రం ఎన్ని అవాంతరాలు వచ్చినా ఎదురుతిరిగి తమ అస్తిత్వాన్ని నిలుపుకోవడం జరిగిం దన్నమాట. అందువల్లనే ఒకప్పుడు భారతదేశంతో సమానంగా ఉత్తమమైనవిగా వెలుగొంది స్వర్గధామాలుగా వెలసిల్లిన మెసపటోమియా, ఈజిప్ట్, బాబిలోనియా, అస్సిరియా, పర్షియా, గ్రీస్, రోమ్ దేశాల సంస్కృతులు ఈనాడు దాదాపు నామరూపాలు లేకుండా అంతరించిపోవడం చారిత్రాత్మక సత్యంగా అందరి కళ్లముందూ నిలుస్తున్నది. ఈ విషయాన్ని ఎలా గ్రహించడం అంటే, ఈనాడు ఆ యా దేశాలలో ఉన్న సంస్కృతికీ, ఆ దేశాల ప్రాచీన శాస్త్రీయ గ్రంథాల ద్వారా, చారిత్రక గ్రంథాల ద్వారా తెలియవస్తున్న సంస్కృతికీ ఎక్కడా పోలిక లేకపోవడమేనని చెప్పాల్సి ఉంటుంది. భారతదేశంలో కూడా ఇట్టి పరిస్థితి కొంతవరకు లేకపోలేదు కానీ, పాశ్చాత్య దేశా లంతటి అధ్వాన్నం మాత్రం కాదని చెప్పవచ్చు. అంటే భారత దేశ ప్రజలు సాంస్కృతికంగా రెండడుగులు వెనక్కు వేస్తే, పాశ్చాత్యదేశాల ప్రజలు దాదాపు ఏడడుగులు వెనక్కు వేశా రన్నమాట. ఇది మానవ జాతి తిరోగమనంలో వారు వేసిన ముందడుగు. ఇదే ప్రగతి అని వారికి అనిపించింది ... విద్యాగంధం లేకపోవడంవల్ల, వేద విజ్ఞానం కొరవడడంవల్ల, సంస్కృత భాషాభ్యాసం పూర్తిగా మూలపడడం వల్ల.

ఇప్పుడు మళ్లీ పరిస్థితి మారుతోంది. గత 250 సంవత్సరాలుగా దాదాపు అన్ని పాశ్చాత్య దేశాలలోనూ సంస్కృత భాషాధ్యయనం, వేదాధ్యయనం ముమ్మరంగా సాగుతోంది. అదే ఆధునికంగా సైన్స్ అని పిలవబడే వేద విజ్ఞానానికీ, ఉత్తమ సంస్కృతికీ దారి తీస్తోంది. త్వరలోనే మరో ఉషోదయం రాబోతోందని నిర్ధారిస్తోంది.

- ప్రొఫెసర్ మూర్తి

---

ఓ వారం చాలా ప్రశాంతంగా గడిచింది. తండ్రి చాలా నిర్లిప్తంగా ఉండడం తను డబ్బు పెట్ట మనడం వల్లే అనుకుని ఊరుకున్నాడు రామ్మూర్తి.

ఆ రోజు సాయంత్రం కొడుకుని పిలిచారు. "రా, కూర్చో! నీతో ఓ మాట చెప్పాలి!" అన్నారు.

"అర్జెంటా?" అడిగాడు.

"అవును. నేను ఇంకో నెల రోజుల్లో వృద్ధాశ్రమానికి వెళ్తున్నాను. ఇద్దరు ఉండే గది చూసుకున్నాను. నాతో నాగభూషణం కూడా ఉంటాడు" అన్నారు కొడుకు ముఖంలోకి చూస్తూ.

రామ్మూర్తి ముఖంలో 'అమ్మయ్య' అన్న భావన కొట్టొచ్చినట్టు కనబడింది. అయినా, "ఎందుకు నాన్నా! మీ కేం ఇల్లు లేదా? నేను లేనా? మీ కేం లోటు?"

"లోటు లేదు. రాదు కూడాను. నీకు నేను చెప్ప దలుచుకున్నది ఒక్కటే. ఓ నెల్లాళ్లలో నువ్వు ఇల్లు ఖాళీ చెయ్యాలి. బ్యాంకు వాళ్లకి లీజు రాస్తున్నాను" అన్నారు.

ఉరమని పిడుగు పక్కనే పడ్డట్టు ఉలిక్కి పడ్డాడు రామ్మూర్తి.

"మీకు వెళ్లాలని ఉంటే వెళ్లండి. నే నెందుకు ఖాళీ చేయడం?" కోపంగా అడిగాడు.

"నీ దగ్గర అద్దె సరిగా రాదు. నాకు ఖర్చులకు సమయానికి డబ్బు రాకుంటే ఇబ్బంది. అందుకే ఈ ఏర్పాటు. నెల నెలా అద్దె బ్యాంకులో జమ అవుతుంది. నా పెన్షన్, అదీ - అక్కడ నా ఖర్చులకి సరి పోతాయి."

చాలా ప్రశాంతంగా అంటున్న తండ్రి మాట నమ్మలేకపోయాడు రామ్మూర్తి. "ఎప్పటికైనా ఇది నా ఇల్లే కదా?"

"ఎలా? ఇది నా స్వార్జితంతో కట్టించాను. దీని మీద ఓ రూపాయి లేదు నీ పెట్టుబడి. మరిచి పోకు!"

"నాన్న! మీకు మతి పోయిందా? ఎవరు నూరి పోసిన బుద్ధి?" ఆవేశంగా అడిగాడు.

"అరవకు! నా నిర్ణయం మారదు. నేను ఈ ఇల్లు నీకే ఇస్తానని నమ్మకు. నేను అవసరం అనుకుంటే అమ్మేసినా అమ్మేస్తా. ఎన్నాళ్లు బతుకుతానో నాకే తెలియదు కదా! అందుకే ఈ ప్లానింగు" ప్రశాంతంగా అన్నారు.

"ఏం సామాను విసిరేస్తారా?"

"అందుకే కదరా నెల్లాళ్లు టైమిస్తుంటా! నే వెళ్లే రోజున తాళాలు నా చేతికి రావాలి" అన్నారు దృఢంగా.

"మై గాడ్! ఎంత స్వార్థం నాన్నా, ఈ ముసలి వయసులో?"

"అవునురా! ఇంత చిన్న వయసులో మీ కున్న స్వార్థంతో పోలిస్తే నా స్వార్థం ఎంత? చాలా తక్కువ. నా స్వార్థంలో భయం ఉంది. అందులో అర్థం ఉంది. నీ స్వార్థంలో ఏ ముందని? ఆలోచించి చూడు. మరచిపోకు - నెల!" అంటూ వాలు కుర్చీలో జేరబడి కళ్లు మూసుకున్నారు పురుషోత్తమరావు గారు.

అవాక్కయి చూస్తుండి పోయాడు రామ్మూర్తి.

కథాప్రభలో
శ్రీమతి ఎన్.
కల్యాణసుందరీ జగన్నాథ్
పెద్దకథ
'మట్టిగోడలు'
త్వరలో